ప్రజాశక్తి
శనివారం 27 సెప్టెంబరు 2025
5
శ్రీకాకుళం

యువతకు క్విజ్ పోటీలు

శ్రీకాకుళం సిటీ : జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వికసిత్ భారత్ యంగ్ ఛాలెంజ్ క్విజ్‌ను నిర్వహిస్తున్నట్లు సెట్‌శ్రీ సిఇఒ వి.వి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు గల యువత ఎంట్రీ ఫీజు లేకుండా ఈ క్విజ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. బహుళ ఎంపికల విధానంలో నిర్వహించే ఈ పోటీని తెలుగు సహా 12 భాషల్లో మై భారత్ పోర్టల్ https://mybharat.gov.in/pages/vbyldలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనడానికి అక్టోబర్ 15వ తేదీ చివరి గడువు అని తెలిపారు. భవిష్యత్ భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలన్న లక్ష్యంతోనే ఈ క్విజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత ఈ క్విజ్‌లో అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

ఎంపీ ల్యాడ్స్‌లోనూ వెనుకబాటే..

- గత రెండు విడతల్లోనూ సరిగా వినియోగించని వైనం
- ఆడిట్, నెలవారీ ప్రగతి నివేదికలు సమర్పించక సకాలంలో విడుదల కాని నిధులు
- పదేళ్ల కాలంలో రూ.4.14 కోట్లు ఖర్చు చేయలేకపోయిన కేంద్ర మంత్రి
- నిధుల వినియోగంపై కొరవడిన శ్రద్ధ

ఆమదాలవలస మండలం చీమలవలసలో షెడ్ నిర్మాణం జరగని శ్మశానవాటిక ప్రాంతం

జిల్లాలో రోడ్లు, తాగునీరు, విద్యుద్దీపాలకు నోచని గ్రామాలు అనేకం ఉన్నాయి. చివరకు కొన్ని ప్రాంతాల్లో శ్మశానాలకు రోడ్లు లేని పరిస్థితులూ ఉన్నాయి. వీటికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు అంతంతమాత్రంగా ఉండడంతో, గ్రామాల్లో తీవ్ర మౌలిక వసతుల కొరత నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎంపీ ల్యాడ్స్ (లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్) రూపంలో నియోజకవర్గాలకు సమకూరే నిధులే ప్రత్యామ్నాయంగా ఉన్నాయి. వీటినీ సరిగ్గా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. జిల్లా వెనుకబడి ఉందంటూ సభలు, సమావేశాల్లో చెప్పే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడే నిధుల వినియోగంలో వెనుకబడినట్లు గణాంకాల బట్టి తెలుస్తోంది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎంపీగా మూడుసార్లు ఎన్నిక కాగా, పదేళ్ల కాలంలో సమకూరిన ఎంపీ ల్యాడ్స్ నిధుల్లో రూ.4.14 కోట్లను ఉపయోగించుకోలేకపోయారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

దేశంలో ఉన్న ప్రతి పార్లమెంట్ సభ్యునికీ కేంద్ర ప్రభుత్వం ఎంపీ ల్యాడ్స్ పేరుతో ఏడాదికి రూ.ఐదు కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తోంది. వీటితో నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుద్దీపాలు, సామాజిక భవనాలు తదితర శాశ్వత ఆస్తులను సృష్టించే పనులకు డబ్బులను కేటాయించాల్సి ఉంటుంది. ఇందులో ఎస్‌సి జనాభా ఉన్న గ్రామాలకు 15 శాతం, ఎస్‌టి గ్రామాలకు 7.5 శాతం మేర నిధులు వెచ్చించాలి. 2019-24 పార్లమెంట్ పదవీ కాలానికి (17వ లోక్‌సభ) సంబంధించి ఏడాదికి రూ.ఐదు కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.25 కోట్లు రావాల్సి ఉంది. కోవిడ్-19 వ్యాప్తితో 2019-20, 2020-21 ఏడాదికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎంపీ ల్యాడ్స్ నిధులను ఆపేసింది. 2021-22 సంవత్సరంలో రూ.రెండు కోట్లు మాత్రమే ఇచ్చింది. అక్కడ్నుంచి ప్రతి ఏడాదీ రూ.ఐదు కోట్లు కేటాయిస్తోంది.

రెండు పర్యాయాల్లో ఖర్చు కాని రూ.4.14 కోట్లు

శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 17వ లోక్‌సభ (2019-24) కాలానికి ఎంపీ ల్యాడ్స్ రూపంలో రూ.17 కోట్లు రావాల్సి ఉంది. అందులో కేవలం రూ.9.50 కోట్లు విడుదల కాగా రూ.7.50 కోట్లు రాలేదు. ఎంపీ ల్యాడ్స్ కింద వచ్చిన సమకూరిన నిధుల్లో రూ.2.30 కోట్లు ఖర్చు చేయలేదు. అదేవిధంగా 16వ లోక్‌సభ (2014-19) కాలానికి రూ.25 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉండగా, రూ.22.50 కోట్లను ఇచ్చింది. ఇందులో రూ.2.12 కోట్లను ఖర్చు చేయలేదు. 16వ లోక్‌సభ కాలంలో రెండు విడతలు, 17వ లోక్‌సభ కాలంలో మూడు విడతల సొమ్ము విడుదల కాలేదు. రెండు లోక్‌సభ పదవీ కాలానికి సంబంధించి మొత్తం రూ.4.14 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోయింది. ఆడిట్ ధ్రువపత్రాలు, నిధుల వినియోగ పత్రాలు, నెలవారీ ప్రగతి నివేదికలు పంపకపోవడంతో, ఆ డబ్బులు రాలేదని తెలుస్తోంది.

రెండేళ్లలో 60 శాతమే ఖర్చు

జిల్లాలో 17వ లోక్‌సభ పీరియడ్‌కు సంబంధించి 2023-24 వరకు మొత్తం రూ.7.35 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయి. వాటితో సిసి రోడ్లు, తాగునీరు, విద్యుత్ లైన్లు తదితర మౌలిక సౌకర్యాలు సమకూర్చేందుకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 128 రకాల పనులు గుర్తించారు. రెండేళ్లు గడుస్తున్నా, అందులో ఇప్పటివరకు 82 పనులు పూర్తయ్యాయి. వీటి కోసం రూ.4.41 కోట్లను ఖర్చు చేశారు. రూ.1.69 కోట్ల విలువైన 31 పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.

శ్మశానవాటిక పనులకూ దిక్కులేని వైనం

జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇపిడిసిఎల్, గిరిజన సంక్షేమశాఖ, శ్రీకాకుళం, పలాస మున్సిపల్ కార్పొరేషన్లు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ తదితర శాఖలు పనులు చేపడుతున్నాయి. 17వ లోక్‌సభ కాలంలో వచ్చిన నిధులతో పంచాయతీరాజ్‌శాఖ టెక్కలి విభాగం అధికారులు 48 పనులు చేపట్టగా, ఇప్పటివరకు 33 పనులు మాత్రమే జరిగాయి. శ్రీకాకుళం విభాగం పరిధిలో 26 పనులు చేపట్టగా 12 పనులు పూర్తయ్యాయి. గిరిజన సంక్షేమశాఖ 21 పనులు చేపట్టగా 13 మాత్రమే పూర్తయ్యాయి. ఇపిడిసిఎల్ శ్రీకాకుళం, టెక్కలి విభాగంలో మొత్తం 13 పనులు గుర్తించగా, ఏడు పనులే పూర్తయ్యాయి. పనులు చేపట్టిన ఏ శాఖ కూడా తనకు ఇచ్చిన లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయలేదు. చివరకు కొన్ని ఎస్‌సి ప్రాంతాల్లో శ్మశానవాటిక షెడ్లనూ నిర్మించుకోలేని నెలకొంది. ఉదాహరణకు ఆమదాలవలస మండలం చీమలవలసలో 17వ లోక్‌సభ ఎంపీ ల్యాడ్‌తో ఎస్‌సిలకు శ్మశానవాటిక నిర్మించేందుకు 2024 జనవరిలో పని మంజూరు చేశారు. నేటికీ షెడ్ నిర్మాణం జరగలేదు.

నిధుల ఖర్చుపై శ్రద్ధ కనబరచని కేంద్రమంత్రి

శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులను సకాలంలో వినియోగించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండు లోక్‌సభ పదవీ కాలం సందర్భంగా కేటాయించిన పనులూ ఇప్పటికీ పూర్తి కాలేదంటే, నిధుల వాడకం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పనుల గుర్తింపు, కేటాయింపు వరకు బాగానే జరుగుతున్నా, తర్వాత ఏం జరుగుతుందో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై ప్రతి మూడు నెలలకోసారి ఎంపీ సమీక్షించాల్సి ఉంది. ఎంపీ ల్యాడ్స్‌పై చివరిసారిగా గతేడాది డిసెంబరులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్షించారు. ఎనిమిది నెలల తర్వాత ఈనెల 18వ తేదీన సమీక్ష చేశారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో శనివారం మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఆదివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి ఈనెల 27న దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని దాటనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి సిబ్బంది మండల కేంద్రాల్లో, గ్రామస్థాయి సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. నాగావళి, వంశధార ప్రరీవాహక ప్రాంతాల సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఏదైనా కాజ్‌వేలపై వరద ప్రవాహం ఉంటే వాహనాలను అనుమతించరాదన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద ఎవరూ ఉండరాదన్నారు. కాలువలు, చెరువులు గట్లు బలహీనంగా ఉంటే జాగ్రత్త చర్యగా వాటిని సరిచేయాలన్నారు. విద్యుత్, విపత్తుల నిర్వహణ, ఆర్‌అండ్‌బి, వైద్యారోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

అంగన్వాడీల పనితీరు మెరుగుపడాలి

జిల్లాలో అంగన్‌వాడీల పనితీరుపై నిర్లక్ష్యాన్ని సహించబోమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఐసిడిఎస్‌పై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పిల్లలకు అందే పౌష్టికాహారం సరఫరా నుంచి హాజరు రికార్డుల దాకా ప్రతిదాన్ని ఖచ్చితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. డేటా ఎంట్రీలో తప్పులు చోటుచేసుకోకూడదని, సమస్యాత్మక అంగన్వాడీలను గుర్తించి ప్రతినెలా సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రీ-స్కూల్‌లలో పిల్లల హాజరు సగటును ప్రతిరోజూ ట్రాక్ చేసి, ప్రస్తుతం ఉన్న స్థాయిని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. సేవలు సమర్థవంతంగా అందించేలా సూపర్‌వైజర్లు, ఎంపిడిఒలు, సిడిపిఒలు, సచివాలయ సిబ్బంది పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ ఐ.విమల, నోడల్ ఆఫీసర్ పి.మణెమ్మ, సిడిపిఒలు పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి అంగన్వాడీల సమస్యలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బర్ల హైమావతి, అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి మంత్రులను కోరారు. అమరావతిలోని అసెంబ్లీలో శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని కోరారు. తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, ఆన్‌లైన్ వర్క్‌కు ఒక యాప్ మాత్రమే ఉండాలని కోరారు. సెంటరు నిర్వహణకు నాణ్యమైన 5జి ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు హామీనిచ్చినట్లు హైమావతి తెలిపారు.

సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న హైమావతి

సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

6న మైనింగ్ కార్యాలయం ముట్టడి

వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిలక్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

అక్రమ మైనింగ్‌ను బినామీల ద్వారా నడిపిస్తూ రాష్ట్ర ఖజానాకు నష్టం కలిగిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడును మంత్రివర్గం నుంచి తొలగించాలని వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. కింజరాపు కుటుంబసభ్యులు మైనింగ్ అక్రమాలపై ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ చర్యలను నిరసిస్తూ అక్టోబర్ ఆరో తేదీన టెక్కలి మైనింగ్ ఎడి కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వైసిపి సానుభూతిపరులకు చెందిన మైనింగ్ వ్యాపారాలపై అక్రమ కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కింజరాపు కుటుంబం కనుసన్నుల్లో మైనింగ్, విజిలెన్స్ అధికారులు పనిచేస్తూ వారికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలోనే రైతులకు యూరియా అందించలేకపోయారని విమర్శించారు. కొత్తమ్మతల్లి ఉత్సవాల ఏర్పాట్లు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఎంత నిధులు విడుదల చేసింది, చేసిన ఖర్చుపై దేవాదాయ శాఖ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓ ఫైనాన్స్ సంస్థ నందిగాం మండలానికి చెందిన ఒక దళిత కుటుంబాన్ని వేధించినా... వారిపై ఆర్‌డిఒ, డిఎస్‌పి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకోవడానికి అసెంబ్లీని వాడుకుంటోందన్నారు. సమావేశంలో నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, ఎ.రాహుల్, కిల్లి అజయ్ కుమార్, పేడాడ రమేష్, చిన్ని జోగారావు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మారిన జిఎస్‌టి శ్లాబులపై ప్రభుత్వ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన ధరల విషయంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి జిఎస్‌టి తగ్గింపు, తగ్గింపు వల్ల ధరల్లో వచ్చిన మార్పులు గురించి ప్రజలకు వివరించాలని ఆదేశించారు. పోస్టర్లు రూపొందించి సచివాలయాలు, గ్రామ, మండలాల వారీగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిఎస్‌టి డిప్యూటీ కమిషనర్, జిఎస్‌టి జిల్లా సేవింగ్స్ నోడల్ ఆఫీసర్ స్వప్నదేవి మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై అవగాహనా కార్యక్రమం ఈనెల 22వ తేదీన ప్రారంభమైందన్నారు. 25 నుంచి 29 వరకు ఇంటింటికీ వెళ్లి చెప్పడం, 30 నుంచి అక్టోబరు ఆరో తేదీ వరకు వ్యవసాయం, ఇతర వృత్తులు, 7 నుంచి 13వ తేదీ వరకు విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్, తదితరమైనవి, 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, రెన్యూబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్స్, 19న రాష్ట్రవ్యాప్తంగా దీపావళి వేడుకలతో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. జిఎస్‌టి తగ్గింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు డబ్బులు ఆదా అవుతాయన్నారు. వ్యాపారులకు అమ్మకాలు కూడా పెరుగుతాయని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పథ్వీరాజ్ కుమార్, డ్వామా పీడీ సుధాకర్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, డిపిఒ భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - గార

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మండలంలోని అంపోలులో గల జిల్లా జైలును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఖైదీలు ఇప్పటివరకు వరకు పెట్టిన బెయిల్ పిటిషన్ల దరఖాస్తులు తీసుకున్నారు. ఖైదీలకు పెట్టే ఆహారాన్ని పరిశీలించారు. జైలు పరిసర ప్రాంతాలను సందర్శించి సూచనలు చేశారు. అనంతరం నరసన్నపేటలోని సబ్ జైలును సందర్శించారు.

పరిశీలిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పలాస

జిఎస్‌టి శ్లాబ్‌ల మార్పుతో తగ్గిన ధరలను అమలు చేయడంతో పాటు పాత, తగ్గిన ధరలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ కె.నాగరాజు వ్యాపారులకు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం భవనంలో పలాస-కాశీబుగ్గ జంట పట్టణ వ్యాపారులు, ట్రేడ్ లైసెన్స్‌దారులతో శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్‌ను అందిపుచ్చుకుని ఖాతాదారులకు నిర్దేశించిన ధరలకు విక్రయాలు చేపట్టాన్నారు. నెల రోజుల పాటు జిఎస్‌టిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిసిఎంఎ అధ్యక్షులు మల్లా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా, కోశాధికారి మల్లా సంతోష్, పారిశ్రామికవాడ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపును వ్యాపారులు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో వ్యాపారులు మల్లా భాస్కరరావు, సిందిరి సతీష్, తాళాసు శ్రీను, డోకి నాగేశ్వరరావు, కొత్తకోట తిరుమలరావు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో రాత్రి 8 వరకు ఆధార్ సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజలకు ఆధార్ సేవలను మరింత సులభతరం చేసే దిశగా శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లోని హెడ్ పోస్టాఫీసుల్లో ఆధార్ సేవా కౌంటర్లు ప్రతి పని రోజున ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

శ్రీకాకుళం, టెక్కలి, ఆమదాలవలస హెడ్ పోస్టాఫీసుల్లో ఈ సేవలు లభ్యం కానున్నాయని పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో కొత్త ఆధార్ నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, ఇమెయిల్ ఐడి నవీకరణ, బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు పిల్లల తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి అన్ని రకాల ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సేవలను పొందే వారు తప్పనిసరిగా గుర్తింపు, చిరునామా, పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పోస్టల్ శాఖకు సంబంధించిన దీన్ దయాల్ స్పర్శ యోజన ఫిలాటలీ స్కాలర్‌షిప్ మొదటి స్థాయి పరీక్ష తేదీలో మార్పు చోటు చేసుకుందని తెలిపారు. పాఠశాలలకు దసరా సెలవులు కావడంతో ఈ పరీక్షను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష వచ్చే నెల 12వ తేదీన ఉంటుందని, ఈ మార్పును గమనించాలని కోరారు. మరింత సమాచారం కోసం సంబంధిత పోస్టాఫీసులు గానీ యుఐడిఎఐ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో ఎఐవైఎఫ్ రూపొందించిన డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కావద్దని, వాటి వినియోగం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమన్నారు. మాదకద్రవ్యాలపై నిఘా పెట్టి నిర్మూలనకు చర్యలు చేపడుతోందన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఈనెల 28 నుంచి అక్టోబర్ నాలుగో తేదీ వరకు ప్రచారానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

డిఆర్‌ఎం పలాస రైల్వేస్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి - పలాస

ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దారోడ్ డివిజన్ రైల్వే మేనేజర్ అలోక్ త్రిపాఠి పలాస రైల్వేస్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. అమృత్ భారత్ రైలును ఒడిశా రాష్ట్రం బరంపూర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 27న వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. పలాసలో ఈ రైలును కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ ఏర్పాట్లను పరిశీలించేందుకు డిఆర్‌ఎం వచ్చారు. రెండో ప్లాట్‌ఫారంలో ఈ రైలును నిలుపుదల చేయనుండడంతో స్టేషన్‌ను సుందరీకరించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ కమర్షియల్ మేనేజర్ అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

బెంతు ఒరియాలకు న్యాయం చేయాలి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి- కవిటి

జనజీవన స్రవంతిలో అందరితో కలిసి ఉన్నా నేటివిటీ లేని ఒకటిక్క సామాజిక వర్గం బెంతు ఒరియాలని, వారికి న్యాయం చేయాలని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం శాసనసభ సమావేశాల జీరో అవర్‌లో బెంతు ఒరియా సమస్యలను విప్ ప్రస్తావించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న సుమారు 25 వేల నుంచి 30 వేల మంది బెంతు ఒరియాలు గత మూడు దశాబ్దాలుగా తమను ఎస్‌టిలుగా పరిగణించాలని పోరాడుతున్నారని, అయినా ఇప్పటికీ తాము ఏ వర్గానికి చెందినవారో తెలియకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యంగా నేటివిటీ సర్టిఫికెట్ లేకపోవడంతో బెంతు ఒరియా విద్యార్థులు చదువుకోవడానికి, ఉద్యోగాలకు విఘాతం కలుగుతున్నట్టు తెలిపారు. దీంతో వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం వంటి పథకాలు అమలులో అవాంతరాలు ఎదురవుతున్నట్టు విప్ అశోక్ తెలిపారు. గత వైసిపి హయాంలో వీరి సమస్యపై రెండు కమిషన్లు ఏర్పాటు చేసినా ఇంతవరకు వాటి నివేదిక బయటకు రాలేదన్నారు. బెంతు ఒరియాలతో పాటు మరికొన్ని సామాజిక తరగతులు తమది ఏ కులమో తెలియక సమస్యలు ఎదుర్కొంటున్నట్టు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ఇప్పటికే పిటిషన్ రూపంలో ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి బెంతు ఒరియాలకు న్యాయం చేయాలని విప్ కోరారు.

మాట్లాడుతున్న విప్ అశోక్

పిఎసిఎస్ భవనానికి నిధులు కేటాయిస్తాం

డిసిసిబి ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో పిఎసిఎస్ భవనానికి స్థలం కేటాయిస్తే తక్షణమే నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మిస్తామని డిసిసిబి ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం కవిటి పిఎసిఎస్‌ను సందర్శించిన ఛైర్మన్‌కు స్థానిక నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పిఎసిఎస్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతుల అవసరాల మేరకు ఎల్‌టి, ఎస్‌టి రుణాలు మంజూరు చేయాలని సిబ్బందికి తెలిపారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు మంజూరు చేసి బెజ్ స్టాండింగ్ పెంచాలన్నారు. మొండి బకాయిలపై దృష్టి సారించి నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, మాజీ జెడ్‌పిటిసి బెందాళం రమేష్, ప్రధాన కార్యదర్శి బెందాలం తిరుమల కుమార్, పిఎసిఎస్ సిఇఒ బెందాలం చిరంజీవి పాల్గొన్నారు.

కవిటి : మాట్లాడుతున్న డిసిసిబి ఛైర్మన్ సూర్యనారాయణ

ఇచ్ఛాపురం: వ్యవసాయ పరపతి సంఘాల అభివృద్ధికి వివిధ రుణాలు అందిస్తామని డిసిసిబి ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. స్థానిక పిఎసిఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌కి పిఎసిఎస్ అధ్యక్షుడు పెద్దిన బాబ్జీ, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పిఎసిఎస్‌లో ద్వారా అర్హత గల రైతులను సభ్యులుగా చేర్చుకుని రుణాలు మంజూరుకు సహకారం అందిస్తామన్నారు. సిఇఒ బత్తుల భుజంగరావు, బాలకృష్ణాపురం సర్పంచ్ ప్రతినిధి బోరుబద్ర లోహిదాసు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక అవస్థలు

ప్రజాశక్తి- నందిగాం

తమండల కేంద్రంలో ప్రయాణికులకు బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ నందిగాం మండల కేంద్రానికి చేరుకునే వారితో పాటు నందిగాం, పెంట ఊరు, శివరాం పురం, నరేంద్రపురం, సుబ్బమ్మపేట, మొండి రావివలస, ఆకుల రఘునాథపురం, బెజ్జిపల్లి పోలవరం తదితర గ్రామాల వారు బస్సు ఎక్కాలంటే నందిగాం మండల కేంద్రానికి చేరాల్సిందే. అయితే ప్రతిరోజూ ఈ కేంద్రం నుంచి వేలాది మంది టెక్కలి, పలాస వంటి పట్టణాలతో పాటు విశాఖపట్నం, హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను కూడా ఆశ్రయిస్తుంటారు. అయితే అటు ఎండలోగాని ఇటు వర్షంలోగాని తడిసే బస్సుల కోసం వేచి ఉండి తమ ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. మండల కేంద్రం ఏర్పడి 40 ఏళ్లు కావస్తున్నా మండల కేంద్రంలో కనీసం బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. తక్షణమే మండల కేంద్రంలో బస్సు షెల్టర్‌ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

బస్సు షెల్టర్ లేక కాలవ గట్టుపై కూర్చున్న ప్రయాణికులు

ఆ భూములను రెవెన్యూ పరిధిలోకి తేవాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార మండలంలోని మొగలదలపాడులో భూములు రెవెన్యూ పరిధిలో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అసెంబ్లీలో గార మండలం మొగదలపాడు గ్రామస్తులు తమ భూములపై పడుతున్న ఇబ్బందులను సభ దృష్టికి తెచ్చారు. గత కొన్నేళ్లుగా అక్కడి భూములు అటవీశాఖ పరిధిలోనూ, కోస్టల్ కారిడార్ పరిధిలోనూ ఉండి పోవడంతో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు నోచుకోవడం లేదని తెలిపారు. దీంతో తమ భూములపై తమకు ఎటువంటి హక్కు లేకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, సంబంధిత రెవెన్యూమంత్రి స్పందించి మొగదలపాడు భూములను రెవెన్యూ పరిధిలోకి తీసుకువచ్చి నోటిఫై చేయాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

పర్యవేక్షణ కమిటీ సభ్యునిగా రమణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రమణమూర్తి

జిల్లా బాలల గృహాల సంరక్షణ కమిటీ సభ్యునిగా కొమ్ము రమణమూర్తిని నియమిస్తూ శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీశారు. జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన బాలల గృహాల పనితీరుపై ఈ కమిటీ పర్యవేక్షణ చేస్తుంది. ఈ జిల్లాస్థాయి కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మూడేళ్ల కాల పరిమితి గల ఈ కమిటీ జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ బాలల గృహాల చట్టం ప్రకారం నిబంధనలు పాటిస్తున్నారా లేదా పర్యవేక్షణ చేసి నివేదికలు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందజేస్తారు. కొమ్ము రమణమూర్తి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గత 32 ఏళ్ల నుంచి బాలలహక్కుల కోసం, ఆదివాసీ, మత్స్యకార, రైతులు, మహిళలు, విపత్తులు నిర్వహణ తదితర కార్యక్రమాలను చేస్తూ సేవలందిస్తున్నారు. స్వీప్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులుగా, డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. విద్యాహక్కు చట్టం అమలుకు సమాచార హక్కు కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా, నేషనల్ కౌన్సిల్ సభ్యునిగా కృషి చేస్తున్నారు. ఈ.నియామకంపై లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు హారికాప్రసాద్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, ప్రముఖ సంఘ సేవకులు మేడూరి ప్రసాదరావులు హర్షం వ్యక్తం చేశారు.

ఐతమ్‌లో 'ఎఐ'పై ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాట్లాడుతున్న అవ్యాస్ అల్ సంస్థ ప్రతినిధి

టెక్కలి ఐతమ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన అవ్యాస్ అల్ సంస్థ ఆధ్వర్యంలో రెండురోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి నాగేశ్వరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ అల్, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై సమగ్ర శిక్షణ అందించారన్నారు. కార్యక్రమానికి అవ్యాస్ అల్ సిఇఒ సుధాకర్ గంటా, సహ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ బొమ్మెన హాజరై విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నైపుణ్యాలు సంపాదించడం ఎంతో ముఖ్యమని, ఇలాంటి శిక్షణలు విద్యార్థుల కెరీర్‌ను బలోపేతం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ జి.ప్రసన్న లక్ష్మి, హెచ్‌ఒడిలు డాక్టర్ వై.రమేష్, డాక్టర్ బి.రమేష్ నాయుడు, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న నాయకులు

యూరియా కోసం నిరసన ర్యాలీ

ప్రజాశక్తి- కంచిలి

మండల రైతాంగానికి అవసరమైన యూరియా అందించాలని కోరుతూ స్థానిక జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, మాజీ ఎంపిపి ఇప్పిలి కృష్ణారావు ఆధ్వర్యంలో శుక్రవారం కంచిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల రైతులకు యూరియా సకాలంలో అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి శాంతియుత నిరసన తెలియజేస్తామని 15 రోజులు ముందు జెడ్‌పిటిసి ప్రకటించారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ నిరసనలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి దేవదాస్, వైసిపి నాయకులు వజ్జ మృత్యుంజయరావు, రామదాసు, కె.శేఖర్, బలరాం తదితరులు పాల్గొని సంఘీభావం తెలియజేశారు. రాష్ట్రంలో రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జెడ్‌పిటిసి లోలాక్షి మాట్లాడుతూ మండలంలో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నిరసన అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రమేష్ కుమార్‌కు అందజేశారు.

చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి శివాజీ

ప్రజాశక్తి- పలాస

సిఎం చంద్రబాబుతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే

సిఎం చంద్రబాబు నాయుడును శుక్రవారం విజయవాడ తాడేపల్లిలో మాజీమంత్రి గౌతు శివాజీ, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గం సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లారు. అనేక అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపై తయారు చేసిన నివేదికను సిఎంకు చూపించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస


మాట్లాడుతున్న రవికుమార్

రాష్ట్రంలో విద్య, వైద్యం, దేవాదాయ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలపై సంబంధిత శాఖ మంత్రులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 1998 ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన ఉద్యోగులు కేవలం మినిమం టైమ్‌స్కేల్ (ఎమ్‌టిఎస్)తో విధులు నిర్వహిస్తు న్నారని, ఇటీవల వారిని వందల కిలోమీటర్ల దూరం బదిలీలు చేయడం ద్వారా చాలా ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. వారిని వారి గ్రామాలకు అందుబాటులో లేదా క్లస్టర్ పరిధిలో విధులు నిర్వహించే విధంగా విద్యాశాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వివిధ కళాశాలల్లో జూనియర్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కూడా పలు సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్య లను కూడా పరిశీలించి న్యాయం చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో వివిధ దేవాలయాల్లో గతంలో ఎన్‌ఎంఆర్ ఉద్యోగులుగా విధుల్లో చేరి నేటికీ కాంట్రాక్టు ఉద్యోగులుగానే చాలా మంది కొనసాగుతున్నారని, వారికి కూడా న్యాయం చేయాలని కోరారు. ఇవే కాకుండా పలు విభాగాల్లో కార్పొరేషన్ల ద్వారా ఎంపికైన ఉద్యోగులు కూడా కొన్ని సమస్యలతో ఇబ్బందులకు గురవు తున్నారని వాటిని కూడా సంబంధిత శాఖ మంత్రులు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ కోరారు.

మినీ జలాశయం నిర్మించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

దేశిబంధ- కొత్త చెరువు మినీ జలాశయం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలాస నియోజకవర్గం జనసేన సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు ఎపి జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ కె.నరసింహమూర్తిని కోరారు. ఈ మేరకు విజయవాడలో జలవనరుల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించినట్టు ఆయన తెలిపారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ శివారు ఆయకట్టు పరిధిలో వజ్రపుకొత్తూరు మండలం బెండి, నగరంపల్లి పంచాయతీ పరిధిలో గల దేశిబంద - కొత్త చెరువు అనే రెండు జంట చెరువుల విస్తీర్ణం 55 ఎకరాలు, దాదాపు 800 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే సామర్థ్యం ఉన్నా ఇంతవరకు ఎవరు పట్టించుకోలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ రెండు చెరువులను మినీ రిజర్వాయర్ నిర్మాణం చేయాలని కోరారు. మినీ రిజర్వాయర్ నిర్మాణం కోసం నగరంపల్లి, బెండి, గల్లీ, శివరాంపురం గ్రామాల రైతులు కొన్నేళ్లుగా ఆశతో ఎదురు చూస్తూ తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. గతంలో ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకపోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి మైనర్ ఇరిగేషన్ విభాగం కింద పరిగణించి, త్వరితగతిన క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ప్రాజెక్ట్ లక్ష్యాలను, ప్రణాళికను, రూపకల్పన కోసం వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేసి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమైన వనరులు, నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న దుర్గారావు

వ్యాసరచన పోటీలు

పలాస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సత్యసాయి సంస్థ అధ్వర్యంలో శుక్రవారం రేపటి భవిష్యత్ నేడు మీ చేతుల్లో అనే అంశంపై తెలుగు, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి.ప్రసాద్, కె.మధుబాబు, సత్యసాయి జిల్లా సాధన శిభిరం ఇన్‌ఛార్జి జెసిహెచ్ శ్రీనివాస్, పలాస కన్వీనర్ తిరుమల, పి.శ్రీనివాస్, కామేశ్వరరావు, కొండలరావు, సభ్యులు పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి నృత్య పోటీలు

వజ్రపుకొత్తూరు: అమలపాడు (దాసరివానిపేట)లో ఈ నెల 29న జిల్లాస్థాయి మహిళల నృత్యపోటీలు నిర్వహిస్తున్నట్లు సాయికిరణ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. 24వ వార్షికోత్సవం సందర్భంగా సరస్వతీ దేవీ పూజా మహోత్సవాలను పురస్కరించుకుని పోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రూపు నృత్యాలకు మాత్రమే ప్రవేశం ఉందని, 15 ఏళ్ల పైబడిన అమ్మాయిలకు మాత్రమే పోటీల్లో పాల్గొనాలని, సినిమా, ఫోక్ సాంగ్‌లకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. పాటలకు సంబంధించిన దుస్తులు, ప్రాపర్టీస్ వారే తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి పాట ప్రదర్శించాలని, రీమాక్స్‌కు అవకాశం లేదని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 95020 69233, 97039 27643 నంబర్లకు సంప్రదించాలన్నారు.

గ్రానైట్ వితరణ

పలాస: మండలం మాకన్నపల్లిలో నిర్మితమవుతున్న శివాలయం నిర్మాణ పనులకు పిఎసిఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆర్థికసాయం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి దేవాలయ ప్రాంగణంలో శివాలయంతో పాటు పలు దేవాలయాలు నిర్మిస్తున్నారు. ఈ మొత్తం దేవాలయాలన్నింటికి అవసరమైన ఫ్లోరింగ్ కోసం సుమారు రూ.4 లక్షల విలువ చేసే గ్రానైట్ పలకలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న గ్రానైట్ ఫ్లోరింగ్ పనులను పరిశీలించి కమిటీసభ్యులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సైని దేశయ్య, మాజీ సర్పంచ్ కుత్తుమ ధర్మారావు, కుత్తుమ లోకనాథం, బత్తిన వీరాస్వామి, తెప్పల భీమారావు, బత్తిన పోలయ్యతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య శిబిరం

నందిగాం: మండలం గొల్లూరులో శుక్రవారం సంతాన సాఫల్య శిబిరం స్థానిక పశు వైద్య సహాయ సంచాలకులు చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల టిడిపి అధ్యక్షులు పి.అజయ్ కుమార్ ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ జీరు రాజేశ్వరి, డాక్టర్ పి.వి.శరత్‌చంద్ర, నందిగాం మండల పశుసంవర్ధక అధికారి డాక్టర్ గురువెల్లి మన్మథరావు, వజ్రపుకొత్తూరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.పాపారావు, కె.కొత్తూరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.కె.జనక చక్రవర్తి, పశు సంవర్ధక సహాయకులు భార్గవ్, వాసు పైడి, అనిల్, హేమలత, అప్పలరాజు, గోపాలమిత్ర కె.ఈశ్వరరావు, జనసేన నాయకులు తాడెల చిరంజీవి పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికావు

వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి

ప్రజాశక్తి- పలాస

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన తీరుపై వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే బాలకృష్ణ 'సైకో' అని సంబోధించడం అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేయడం సబబుగా లేదన్నారు. అసెంబ్లీలో ఎలా ప్రవర్తించాలో తెలియకుండా ఎమ్మెల్యే బాలకృష్ణ నోటికి వచ్చినట్లు ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తే వైసిపి శ్రేణులు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకోకపోతే జనం వాతలు పెడతారని గుర్తుంచుకోవాలన్నారు. ఇంట్లో తుపాకితో కాల్పులు జరిపి, ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి వైద్య పరంగా బాలకృష్ణ తెచ్చుకున్న సర్టిఫికెట్ ఏమిటో ప్రజలకు తెలుసునన్నారు. ఇప్పటికైనా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

బూర్జ : అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మహిళల ఆరోగ్యమే ముఖ్యం

ప్రజాశక్తి- బూర్జ

స్వస్థ నారి స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బూర్జ పిహెచ్‌సిలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రాజశేఖర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంగమ్మ 51 మంది రోగులకు రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అలాగే కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ వేగు అనురాధ, స్థానిక ఎంపిటిసి చుక్కల పోలి నాయుడు, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోట ఆరోగ్య ఉప కేంద్రం వద్ద స్వస్తి నారి స్వశక్తి అభియాన్ పరివార్ కార్యక్రమాన్ని తొగరాం పిహెచ్‌సి వైద్యాధికారి మెట్ట స్రవంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ సూరపు నాయుడు, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పరిసరాల పరిశుభ్రం పాటించాలని మున్సిపల్ ఎఇ జాన్సన్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లవలస వద్ద కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఇ విద్యాలయం ప్రాంగణం చుట్టూ తిరిగి మౌలిక వసతులను సమీక్షించారు. భవనాల పరిస్థితి, విద్యార్థుల వసతి గృహాలు, తరగతి గదులు, వంటశాల, మంచినీటి సరఫరా వ్యవస్థ, శానిటేషన్ సౌకర్యాలు, పారిశుధ్యం తదితర అంశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటి సరఫరా క్రమం తప్పకుండా జరుగుతుందా లేదా మరుగుదొడ్లు సక్రమంగా పనిచేస్తున్నది లేనిది వంటశాలలో శుభ్రత పరిస్థితులు ఎలా ఉన్నాయన్న అంశాలను పరిశీలించి లోటుపాట్లుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను సిబ్బంది ఎఇ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కెజిబివి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంటగదిని పరిశీలిస్తున్న ఎఇ జాన్సన్

అవగాహన కల్పిస్తున్న వైద్యులు తదితరులు

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రంతో పాటు మాతల, దిమిలి, మెట్టూరు, నీలకంఠాపురం, ఎన్ని రామన్నపేట, దాశరథిపురం గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య ప్రచార రథం, ఎయిడ్స్‌పై చిత్ర ప్రదర్శనతో ప్రజలకు అవగహన కల్పించారు. ఈ. సందర్భంగా ఐటిసి కౌన్సిలర్ సిహెచ్ భాస్కరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐసిటిసి కేంద్రంలో జరిగే ఉచిత హెచ్ఐవి పరీక్షలు, వ్యాధి సోకిన వారు తీసుకోవాల్సిన ఆర్ట్‌డ్రగ్‌పై, రోగులకు ప్రభుత్వం ఇస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సామజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ లీలాకుమార్, వైద్యులు రాకేష్, సురేంద్ర, దేవి ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్.జనార్దనరావు, లింక్ వర్కర్స్ శ్రీను, భారతి, బాలరాజు, గెస్ట్ స్వచ్ఛంద సంస్థ లక్ష్మి, కృష్ణవేణ, భాను పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ఆదాయం రూ.22 లక్షలు

కోటబొమ్మాళి: శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాల ద్వారా మంగళ, బుధ, గురువారాల్లో రూ. 22,08,481 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధర్మహుండీలను దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో విప్పి లెక్కించారు. స్పెషల్ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.4,25.000, మొక్కుబడి రుసుం ద్వారా రూ.2,38,600, హుండీల ద్వారా రూ.15,44,881 ఆదాయం లభించిందన్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రూ. 3,86,964 ఆదాయం పెరిగిందని ఆయన తెలిపారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

ఈ లెక్కింపు కార్యక్రమంలో శ్రీకాకుళం ఎసి బి.ఆర్.వి.వి. ప్రసాద్ పట్నాయక్, గ్రామ పెద్దలు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి

లావేరు:

మాట్లాడుతున్న దామోదరరావు తదితరులు

ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావుపై ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చేసిన అవినీతి ఆరోపణలు వెనక్కు తీసుకోవాలని లావేరు ఎఎసిఎస్ అధ్యక్షుడు కూనపల్లి దామోదరరావు అన్నారు. శుక్రవారం లావేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ఎన్ఇఆర్ నీలా భూదందాలు, ఇసుక, గ్రావెల్ తదితర అవినీతి అక్రమాలకు పాల్పడలేదన్నారు. కోటపాళెంలో ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాజీ ఎమ్మెల్యే కోట్లాది విలువ చేసే 40 ఎకరాలకు పైగా భూకబ్జా చేయలేదా అని ప్రశ్నించారు. అభివృద్ధిని ఓర్వలేక ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. సమావేశంలో పెద్ద కొత్తపల్లి, పెదరావుపల్లి సర్పంచ్‌లు ఆరేళ్ల కృష్ణ, కొన్ని హేమసుందర్, కోనేటి శ్రీనువాసరావు, దన్నాన శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిసి రహదారులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని ఇల్లయ్యగారి పేటలో సిసి రహదారులు, కాలువల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. గ్రామంలోని రామాలయం నుంచి రాంబాబు బడ్డీ కొట్టి వరకు రూ.14 లక్షలతో, అలాగే రచ్చబండ నుంచి కల్లాల వరకు రూ.12 లక్షలతో సిసి రహదారులు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ఖండాపు శ్రీనివాసరావు, జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, కూటమి నాయకులు కోటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వైకుంఠరావు మృతదేహం

కోటబొమ్మాళి: మండలం కొతపల్లి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వాన వైకుంఠరావు (55) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మృతుడు వైకుంఠరావు గురువారం సాయంత్రం మండలం సరియాపల్లి గ్రామ సమీపంలో ఉన్న పొలం పనులు ముగించుకొని తన భార్య రత్నాలుతో కలిసి నడుచుకుంటూ ఇంటికి వెళు తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కప్పల రమణ తన ద్విచ క్రవాహనంపై వెనుక నుంచి అతివేగంగా ఢీ కొనడంతో వైకుంఠరావు అక్కడకక్కడే మృతి చెందగా, రమణకు గాయాలయ్యాయి. రమణకు టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి, వైకుంఠరావు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు తెలిపారు. మృతుడు భార్య రత్నాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి.సత్యన్నారాయణ తెలిపారు. మృతుడుకు భార్యతో పాటు కుమారుడు శశిభూషణరావు ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని శవశానపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు విశ్వనాథంపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఎస్ఐ అందించిన సమాచారం మేరకు మండలంలోని ఆర్ బెలగాం గ్రామంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో వేధించడమే కాకుండా విద్యార్థిని బెదిరించడంతో విశ్వనాథంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయితో నిందితుడిని ప్రవేశపెట్టిన రైల్వే ఎస్ఐ

14 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అక్రమంగా తరలిస్తున్న నింధితుడును పట్టుకొని అరెస్టు చేశామని పలాస రైల్వే ఎస్ఐ ఎ. కోటేశ్వరరావు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన మెరీన్ ఒడిశా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రానికి తరలించేందుకు పలాస రైల్వేస్టేషన్‌కు రాగా అనుమానంగా కనిపించడంతో బ్యాగ్ తనిఖీ చేయడంతో 14 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి గంజాయి స్వాధీనం చేసుకుని అక్రమంగా తరలిస్తున్న మెరీన్‌ను అరెస్టు చేశామని తెలిపారు.

బంగారం షాపులో చోరీ

లావేరు: మండలంలోని బుడుమూరు గ్రామ రహదారికి ఆనుకుని ఉన్న శ్రీ విజయ దుర్గా బంగారు నగల దుకాణంలో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బంగారు వస్తువులతో పాటు వెండి వస్తువులను అపహరించారు. కలిశెట్టి గూడెం గ్రామానికి చెందిన కలిశెట్టి కృష్ణ బుడుమూరులో బంగారం దుకాణం నడుపుతున్నాడు. యధావిధిగా శుక్రవారం షాపు తెరిచారు. అనంతరం మధ్యాహ్నం గుర్తు తెలియని ముగ్గురు మహిళలు, నగలు కొనుగోలుకు వచ్చారు. మాటల్లో యజమానికి పెట్టి బేరసారాలు ఆడారు. అనంతరం కొనుగోలు చేయకుండానే వెనుదిరిగారు. వారు షాపు విడిచి వెళ్లగా సిసి ఫుటేజ్ పరిశీలించిన యజమాని కృష్ణ చోరీ జరిగినట్లు గుర్తించాడు. సుమారు మూడు గ్రాముల బంగారం ముక్కుపుడకలు 4, 480 గ్రాముల 6 జతల వెండి పట్టీలు అపహరణకు గురైనట్టు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందన్నారు. దీంతో షాపు యజమాని లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం జరిగిన తీరు సిసి ఫుటేజ్‌లో రికార్డు అయిందని, ఫుటేజ్ పరిశీలించామని పోలీసులు తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఎస్ఐ లక్ష్మణరావు స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్సీకి మాతృ వియోగం

బూర్జ: మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ మాతృమూర్తి పీరుకట్ల ఫేమ సుందరమ్మ (90) శుక్రవారం మండలంలోని రాజుపేట స్వగ్రామంలో మృతి చెందారు. విశ్వప్రసాద్ తండ్రి వెంకట అప్పలనాయుడు కూడా ఎమ్మెల్సీగా, సమితి ప్రెసిడెంట్‌గా పదవులను చేపట్టారు. ఈయన గతంలో మృతి చెందారు.

దేవీ ఉత్సవాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామ దేవత శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు జ్ఞాపికను అందించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ భారతీ దివ్య, వార్డ్ కౌన్సిలర్లు బచ్చు జగన్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, పిలక సంతోష్, సెల్లా దేవరాజు, యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కాళ్ళ మదన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వర్తకులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని పాలపోలమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అక్టోబర్ 2 నుంచి రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో అక్టోబర్ 31 నుంచి అన్ని మున్సిపాలిటీల్లో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయబడినది తెలిపారు. ఆ ఉత్తర్వుల ప్రకారం పురపాలక సంఘం పరిధిలో కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వార్డు ఇన్‌ఛార్జిలు, వర్తక సంఘాల అధ్యక్షులు, దుకాణదారులు, వినియోగ దారులు పాల్గొంటారని తెలిపారు.

అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

గొండ్యాలపుట్టుగలో అన్నదానం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గొండ్యాలపుట్టుగలో భూలోకమాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కుంకుమ పూజల్లో పాల్గొన్న 120 మంది మహిళలకు కవిటి గ్రామానికి చెందిన పాండవ రామారావు, ఇందుమతి దంపతులు భూలోక మాత చిత్రపటం ఉచితంగా అందించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు హాజరయ్యారు.

కళాకారులతో కమిటీ సభ్యులు

కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ముత్యాలపేట గ్రామంలోని ముత్యాలమ్మ దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం స్థానిక కళాకారులకు ఆత్మీయ సత్కారం చేశారు. గత కొన్నేళ్లుగా ఉద్దానం ప్రాంతంలో తమ గాత్రం, సంగీతంతో అలరిస్తున్న పొందల శ్రీను, వినోద్, హేమంత్, బొమ్మల బాబూరావు, బొమ్మల తులసీరావ్, వడ్డి మాధవరావు, రెయ్యి యోగానందం, వడ్డి కృష్ణారావు, వడ్డి రాముని దేవస్థానం కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- పలాస

నియోజకవర్గంలో మృతుల కుటుంబాలను శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించారు. మండలం లొద్దభద్రకు చెందిన చిన్నా ఆచారి, చినచల గ్రామానికి చెందిన పొట్నూరు కాంతమ్మ, మహాదేవిపురానికి చెందిన వైసిపి నాయకులు బి. మాధవరావు ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీమంత్రి సీదిరి మృతుల కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, వైసిపి అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పలాస కాశీబుగ్గ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, బమ్మిడి దుర్యోధన, చింతాడ మాధవరావు, అంబటి ఆనందరావు, లండ జోగారావు, వైసిపి నాయకులు తదితరులున్నారు.

ప్రథమ చికిత్స కీలకం

ధ్రువపత్రాలను అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రోడ్డు ప్రమాదాలు, విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స కీలకమని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు బేసిక్ ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం రెడ్‌క్రాస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స శిక్షణ ఎంతో ప్రయోజనకారి అని, నైపుణ్యాలు కలిగిన వారు ఒక ప్రాణాన్ని నిలిపే శక్తి లభిస్తుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ ప్రథమ చికిత్స శిక్షణా కార్యక్రమం ప్రతి ఒక్కరికి అవసరమని, ప్రాణనష్టం తగ్గించడంలో ప్రధాన భూమికి పోషిస్తారన్నారు. అనంతరం అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఫస్ట్ ఎయిడ్, కృత్రిమ శ్వాస, ఎముకలు ఇరుగుల, రక్తస్రావం, కాలిన గాయాలు, పాముకాటు తదితర అంశాలను కె.సత్యనారాయణ, జి.రమణ, పి.చైతన్య కుమార్ బోధించారు. కార్యక్రమంలో అభ్యర్థులు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల మోతాదు మించరాదు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

పంటలు అధిక దిగుబడి సాధించే ధ్యాసలో మోతాదుకు మించిన ఎరువుల వాడకం ద్వారా భూమి సారాన్ని కోల్పోతుందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రాజగోపాల్ అన్నారు. శుక్రవారం వెన్నెలవలసలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పూర్తిగా విస్మరించి రసాయనిక ఎరువులనే వాడకం ప్రారంభించడం ప్రమాదకరంగా మారిందన్నారు. వ్యవసాయ శాఖ అందించే ఆధునిక వ్యవసాయ విధానాలను ఆచరించకుండా అధిక దిగుబడి సాధించాలనే పోటీతత్వం పెరగడం ద్వారా ఎరువులను అధిక మోతాదులో వినియోగించడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ రైతులకు ఉచితంగా అందించే నానో యూరియాను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి ఫౌండేషన్ సమన్వయకర్త అత్తులూరి లావణ్య, రైతులు హరిప్రసాద్, సవర ధర్మారావు, ఎల్లయ్య, బుడ్డు, బిడ్డకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులను పంపిణీ చేస్తున్న ఎడి రాజగోపాల్

న్యాయవాదుల నిరసన

నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎపి హైకోర్టు జారీ చేసిన సర్క్యులర్ నం.10/2025, తేదీ 22-07-2025 ప్రకారం కోర్టుల్లో సంతాపాలను ఉదయం కోర్టు ప్రారంభ సమయంలో కాకుండా సాయంత్రం 4.30 గంటలకు పాటించాలని ఆదేశించిన నిర్ణయానికి వ్యతిరేకంగా బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదులు కోర్టు ఆవరణలో నిరసన తెలియజేస్తూ హైకోర్టు ఆదేశాలను తీవ్రంగా ఖండించారు. సంతాపాలు సాయంత్రం వరకు వాయిదా వేయడం సరైన నిర్ణయం కాదన్నారు. తక్షణమే సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ, సెక్రటరీ బగాది గోవిందరాజు, మాజీ సెక్రటరీ అల్లాడ విజయకుమార్, సీనియర్ న్యాయవాదులు సాధు ధనుంజయరావు, పైడి వరాహనర్సింహులు, తమ్మినేని అన్నం నాయుడు, బూరెల సీతారాం, బొడ్డేపల్లి మోహనరావు, రాజేశ్వరరావు, అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధనుంజయరెడ్డికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం టి.బరపురం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద సంగీత కళాకారులు, ఆల్ ఇండియా కళా రంగం ఎగ్జిక్యూటివ్ మెంబర్, శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనంజయ రెడ్డి విజయవాడ 2 గాంధీనగర్ హనుమంతరాయ నిర్వహించిన ఎస్‌పి బాలసుబ్రమణ్యం 5వ వర్ధంతి సందర్భంగా ధనుంజయ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఆలిండియా కళారంగం నిర్వహించిన కార్యక్రమంలో ధనుంజయ రెడ్డికి ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తూ బాలు పాటలను వైయలిన్‌పై ఆలపించారు. కార్యక్రమంలో పాల్గొన్న ధనుంజయ రెడ్డిని కళారంగం వ్యవస్థాపక కార్యవర్గం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలిండియా కళారంగం అధ్యక్షులు మాడుగుల సుధీర్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన గాయని, గాయకులు పాల్గొన్నారు.

ధనుంజయరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కళారంగం ప్రతినిధులు

పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

కోటబొమ్మాళి: సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం ఆగదని ఎపిసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు చల్ల సింహాచలం అధ్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పాత పెన్షన్ కొనసాగించే వరకు ప్రభుత్వాలు మారుతాయని ఆయన హెచ్చరించారు. నాలుగు లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డిఎ బకాయిలు రూ.20 వేలు కోట్లు ఉండగా చివరిగా హైకోర్టులో కేసు కూడా నమోదు చేశామన్నారు. త్వరలోనే అవి పరిష్కారమవుతాయని, సిపిఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేపట్టడానికి సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాప సభ్యులు బి. బాలకృష్ణ, బొంతల ఆదినారాయణ, రమేష్, వైకుంఠరావు, ప్రశాంత్, షణ్ముఖరావు తదితరులున్నారు.

ప్రశంసాపత్రాలతో నృత్య కళాకారులు

కేరళలో జిల్లావాసుల భరతనాట్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

కేరళ రాష్ట్రంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సిక్కోలు నాట్య కళాకారిణి కూన శ్రీలత, ఆమె బృంద కళాకారులు నృత్య ప్రదర్శన చేపట్టారు. పట్టణానికి చెందిన సీనియర్ నాట్య కళాకారులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ ఆధ్వర్యంలో కేరళలోని రెండు పట్టణాల్లో బుధ, గురువారాలు ఈ ప్రదర్శనలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. 1వ ప్రదర్శన అన్నామలై పట్టణ త్రిబంగి ఉత్సవ నిర్వహణలో సంగీత్ నాటక అకాడమీ సిఎస్ఎ మండపంలో మోహిని భస్మాసుర నృత్యాన్ని ప్రదర్శించడం జరిగిందని శ్రీలత తెలిపారు. అలాగే రెండవ ప్రదర్శన టిడిఎం శత సంవత్సర ఉత్సవాల్లో భాగంగా కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం పట్నంలో మహిషాసుర మర్దిని అనే కళా రూపాన్ని నృత్య ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తమ బృందంతో కేరళ రాష్ట్రం వెళ్లి నృత్య ప్రదర్శన ఇచ్చిన తమకు కేరళ ప్రతినిధులు ఎంతో అభినందించి సన్మానాలు కూడా నిర్వహించారని, ఇది చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

యూరియా కోసం అవస్థలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రేమ్‌కుమార్ యాదవ్

నియోజకవర్గంలో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు మీకు కనపడలేదా, మూడవసారి ఎమ్మెల్యేనని గొప్పలకు పోవడం కాదని నియోజకవర్గం వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ విమర్శించారు. ఖరీఫ్ మొదలై సుమారు మూడు నెలలు గడుస్తున్నా ఎందుకు పూర్తిస్థాయిలో రైతులకు ఎరువులు అందించలేకపోయారని ఆరోపించారు. నియోజకవర్గంలో చిన్న, సన్నకారు రైతులు పడుతున్న ఇబ్బందులకు మీరు తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. టిడిపి నాయకులకు టన్నుల్లో దోచిపెట్టి రైతులకు మాత్రం గ్రామల్లో కొలిచి ఇస్తున్నారని, ఇదెక్కడి న్యాయమన్నారు. రైతులపై పక్షపాత ధోరణి, అధికార దురహంకారం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో రైతులు కచ్చితంగా తగిన గుణపాఠం చెప్తారని, అది తొందర్లోనే తెలుస్తుందన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- కవిటి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ త్రినాథ్ సూచించారు. మండలంలోని కపాసుకుద్ది, నెలవంక, డిజి పుట్టుగ సచివాలయాలను ఎంపిడిఒ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పారిశుధ్య నిర్వహణ పరిశీలించి సూచనలు చేశారు. సిబ్బందితో సమావేశమై స్వామిత్వ, కౌశలం, వాహన మిత్ర తదితర అంశాలపై సూచనలు చేశారు. సచివాలయాల సిబ్బంది అటెండెన్స్ పరిశీలించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ